

దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళనకు కృషి చేస్తా
ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

మొగల్తూరు: దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళనకు తన వంతు కృషి చేస్తానని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులోని కొత్త కాయలతిప్ప వద్ద ఉన్న దర్భరేవు డ్రెయిన్‌ను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. పైప్ కల్వర్టును తొలగించి వంతెన నిర్మాణం చేపట్టాలని, రైతులు నాయకర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. తగు నివేదికలను తయారు చేయాలని డ్రెయినేజీ శాఖ డిఇ సత్యనారాయణకు సూచించారు. ఆయన వెంట ఎఇ పావణ్య, సర్పంచి బందుల ఎలీషా, రైతులు ఎస్ఎంఆర్ నాగేశ్వరరావు, అనంతపల్లి బుల్లబ్బాయి, గోపాలకృష్ణ, గాదే బుల్లి, దేశంశెట్టి శీను, లక్కు బాలాజీ, దోసనపూడి దొరబాబు, అనంతపల్లి సత్తిపండు, నిప్పులేటి రామారావు, కర్రి వీరాస్వామి, ఎంపిటిసి తిరుమాని స్వామి, పులపర్తి నానాజీ, ముక్కు పుల్లయ్య ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులపై..
వేధింపుల పర్వం..!

- పలువురు ఎంపిడిఒలు, ఇఒపిఆర్డిల తీరు చర్చనీయాంశం
- పనిలో టార్గెట్ల పేరుతో తీవ్ర వేధింపులు
- సస్పెండ్ చేస్తాం.. జీతాలు ఆపేస్తామంటూ బెదిరింపులు
- పని వేళలతో సంబంధం లేకుండా విధులు అప్పగింత
- తప్పులు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒలు వెన్నుదన్ను
- నిడమర్రు మండలంలో పరిస్థితి మరింత దారుణం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సచివాలయ ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. వాళ్లు తోటి ఉద్యోగులే అనే మాట పంచాయతీ కార్యదర్శులు, మండలాధికారులు మరిచిపోయి వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. టార్గెట్ల పేరుతో నిత్యం రాచిరంపాన పెడుతున్నారు. పని వేళలతో సంబంధం లేకుండా విధులు అప్పగిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. సెలవు దినాల్లోనూ పనులు అప్పగించి చేయకపోతే జీతాలు ఆపేస్తాం.. సస్పెండ్ చేస్తాం అంటూ బెదిరిస్తున్న పరిస్థితి నెలకొంది. పని చేయకుండా తమకు బాకా ఊదే పంచాయతీ కార్యదర్శులను వెనకేసుకొస్తూ పలువురు ఎంపిడిఒలు వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతా కలిసి సచివాలయ ఉద్యోగులపై పెత్తనం చేస్తూ జిల్లా ఉన్నతాధికారుల వద్ద మార్కులు కొట్టేసేందుకు మసిపూసి మారేడు కాయ చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 938 గ్రామ సచివాలయాలు, 227 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 9,550 మంది వరకూ ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రజలకు దగ్గరగా సేవలందిస్తున్నది సచివాలయ ఉద్యోగులే. క్షేత్రస్థాయిలో పనులు నిర్వహిస్తూ అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగులపై పంచాయతీ కార్యదర్శులు, మండలాధికారులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారుతోంది. పని పేరుతో తీవ్ర వేధింపులు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. ఇటీవల జరుగుతున్న హౌస్‌హోల్డ్ సర్వేకు సంబంధించి టార్గెట్లు విధించి నరకయాతన చూపించారు. ఇప్పుడు స్వర్ణ పంచాయతీ పేరుతో పంచాయతీలోని పన్నులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పని చేయడానికి తమకు ఇబ్బంది లేదని, పంచాయతీ, మండలాధికారులు సచివాలయ ఉద్యోగులను పురుగుల కంటే హీనంగా చూస్తుండటం తీవ్ర బాధ కల్గిస్తోందని వాపోతున్నారు. గతంలో వాలంటీర్లు చేసే పింఛన్ల పంపిణీ, సర్వేలు వంటి పనులన్నీ ఇప్పుడు సచివాలయ ఉద్యోగులే చేస్తున్నారు. అయినప్పటికీ పలువురు మండలాధికారులు మాత్రం సచివాలయ ఉద్యోగుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. ఆరోగ్యం బాగోలేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల పట్ల మానవత్వం మరిచి సెలవు పెట్టడానికి వీలులేదని, పని చేయాల్సిందేనని హింసిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం స్వర్ణ పంచాయతీ పేరుతో పన్నులకు సంబంధించి ఆన్‌లైన్ జరుగుతోంది. ఒక గ్రామంలో వెయ్యి ఇళ్లు దాటితే డిజిటల్ అసిస్టెంట్‌తోపాటు మరొక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకుని పని చేయించాల్సి ఉంది. అలాకాకుండా సచివాలయ ఉద్యోగులందరూ చేయాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల పని వేళలు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ. అయితే ఎనిమిది గంటలకే రావాలని కొంతమంది, పదిలోపే బయోమెట్రిక్ వేయాలంటూ సచివాలయ ఉద్యోగులను నిత్యం వేధిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. సాయంత్రం ఐదు గంటలకు వెళ్లాల్సి ఉండగా, 5.30 గంటల తర్వాతే బయోమెట్రిక్ వేయాలని ఆంక్షలు పెడుతున్నారు. వెళ్లిపోయే ముందు పనులు అప్పగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లేదంటే జీతం ఆపేస్తామంటూ పలువురు పంచాయతీ కార్యదర్శులు బెదిరిస్తున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత సైతం పని చేయాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నిడమర్రు మండలంలో పరిస్థితి దారుణం

సచివాలయ ఉద్యోగుల విషయంలో నిడమర్రు మండలంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నట్లు చర్చ సాగుతోంది. పని చేయని పలువురు పంచాయతీ కార్యదర్శులను వెనకేసుకొస్తూ మండలాధికారులు సచివాలయ ఉద్యోగులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. మండలంలోని మందలపర్రు పంచాయతీ కార్యదర్శి సమయానికి విధులకు రాకపోయినా, రికార్డు సక్రమంగా నిర్వహించకపోయినా ఆయన్ని వెనకేసుకొస్తూ మండలాధికారులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీలోనూ చాలామంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొనడం లేదు. అయినప్పటికీ వారి గురించి మండలాధికారులు పట్టించుకోవడం లేదు. తమకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులను పింఛన్ల పంపిణీ నుంచి కార్యదర్శులు మినహాయిస్తున్నా అధికారులకు పట్టని పరిస్థితి. మందలపర్రు పంచాయతీలోని సమస్యలపై ఇటీవల పత్రికల్లో వచ్చిన అంశాలపై మండలాధికారులు విచారణ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గడిచిన నాలుగు నెలలుగా హాజరు పట్టికలో సంతకాలు పెట్టకపోయినా, అప్పటికప్పుడు పెట్టించి ఆయన్ని కాపాడినట్లు తెలుస్తోంది. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోయినా పట్టించుకోని పరిస్థితి ఉందని సమాచారం. సదరు కార్యదర్శి తీరుతో ప్రజాప్రతినిధులుసైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మండలాధికారులకు పట్టడం లేదని చెబుతున్నారు. సదరు కార్యదర్శి ఉద్యోగులతో ఘర్షణ పడుతున్నా వెనకేసుకొస్తున్న పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. ఈ మండలంలో సచివాలయ ఉద్యోగులను పురుగుల కంటే హీనంగా చూస్తున్నారనే చర్చ ఉద్యోగుల్లో సాగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని అధికారులు బయోమెట్రిక్ హాజరు వేయకపోయినా పట్టించుకోవడం లేదని, సచివాలయ ఉద్యోగులను మాత్రం వేధిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు అక్కడి పరిస్థితులపై దృష్టి సారిస్తేనే అసలు విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంటుంది. పనులు చేసే ఉద్యోగుల పట్ల అధికారులు ఈవిధంగా వ్యవహరించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది.



భీమవరంలో ధర్నా చేస్తున్న నేతలు

మోడీ విధానాలకు వ్యతిరేకంగా నిరసన
సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా
జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి



తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం

రైతాంగానికి గిట్టుబాటు ధరను గ్యారెంటీ చేస్తూ చట్టం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ వాగ్దానాన్ని నిలబెట్టుకోకుండా, వెనక్కి తీసుకుంటానన్న నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేస్తూ, కార్మిక కోడ్‌ల పేరుతో చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భీమవరంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి కార్మిక, కర్షకులు పెద్ద ఎత్తున ప్రదర్శనగా బయలుదేరి ప్రకాశంచౌక్‌కు అక్కడ చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.జమలయ్య మాట్లాడారు. రైతు నల్లచట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన అమలు చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పక్కన పెట్టిందన్నారు. రైతు పండించిన పంటలకు అయిన పెట్టుబడికి 50 శాతం కలిపి గిట్టుబాటు ధరకు చట్టం చేయాలని రైతు పోరాటం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పటివరకూ హామీ నెరవేర్చలేదని విమర్శించారు. లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు రుణమాఫీ చేయడం లేదన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు మామిడిశెట్టి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాతిరెడ్డి జార్జి, శ్రామిక మహిళా నాయకురాలు డి.కళ్యాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను గుడ్డిగా సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలకు అన్యాయం చేస్తోందన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు ప్రజల నుంచి వసూలు చేయడానికి పూనుకుంటోందన్నారు. అనంతరం కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, కె.లక్ష్మణరావు, ఆనంద్, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, అత్రియ్య, గొర్ల రామకృష్ణ, కె.ఝాన్సీలక్ష్మి, నాగరత్నం, వరలక్ష్మి గోపాలకృష్ణంరాజు, పిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అఖిలపక్ష టియు, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల పిలుపులో భాగంగా మంగళవారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మికులకు నష్టం కలిగించే 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా వాటిని తగ్గించడానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రాల్లో జరుగు ప్రదర్శనల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, కర్రి సాయిరెడ్డి, అల్లు సుబ్బారావు, బంకూరు నాగేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, ఎస్.శేషుబాబు, మేట్రేడ్డి రమణ, నరమాల కృష్ణ, గొర్రెల సతీష్‌కుమార్, నర్మాల నారాయణరావు, పి.రమణ, వి.శ్రీను పాల్గొన్నారు.

రాజ్యాంగం గొప్పతనాన్ని తెలియజేయాలి : కలెక్టర్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు కలెక్టరేట్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. అనంతరం వశిష్ట సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో అత్యద్భుతమైన రాజ్యాంగాన్ని అంబేద్కర్ నిర్మించడం జరిగిందని, దీని ద్వారా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పిస్తూ జాతి, కుల, మత భేదాలు లేకుండా అందరూ ఎదగడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకుంటూ, నివాళులర్పించుకోవడం సంతోషించదగిన విషయమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక హక్కును కల్పించడానికి భారత రాజ్యాంగం గొప్పదనం, విశిష్టత ప్రతిఒక్కరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మన పెద్దలు ఎంతో శ్రమపడి రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఎంత గొప్ప రాజ్యాంగాన్ని అయినా అమలు చేయకపోతే దానికి విలువ లేదని, రాజ్యాంగం విలువలను కింది స్థాయి వరకూ తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : జెసి



రైతులతో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి - ఉండి

అల్పపీడనం ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం చిలుకూరు గ్రామంలో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, పట్టుబడులు పట్టే ప్రాంతాన్ని జెసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాటాపై వేసిన ధాన్యం బస్తాలను పరిశీలించారు. సంచికి 40.6 కేజీలు తూకం చేయాల్సి ఉండగా 400 గ్రాములు ఎక్కువ తూకం చేయడాన్ని గమనించారు. ఎందుకు తూకంలో ఎక్కువ మగ్గు చూపిస్తున్నారని రైతులను ప్రశ్నించారు. గోనె సంచులకు చిల్లులు ఉండడం వల్ల కల్లాల వద్ద వాహనాలపై ఎగుమతి, మిల్లులు వద్ద దిగుమతి చేసేటప్పుడు చిరిగిన సంచుల నుండి ధాన్యం కారడం వల్ల తరుగు రాకూడదనే ఉద్దేశంతో తూకంలో మగ్గు చూపిస్తున్నామని జెసికి రైతులు వివరించారు. స్పందించిన జెసి మాట్లాడుతూ డిసిఎం సొసైటీ అధికారులతో మాట్లాడి గన్నీ బ్యాగ్‌లకు ప్యాచ్ వర్క్‌లు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నిర్ధారించిన ప్రకారమే తూకాలు నిర్వహించాలన్నారు. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంగారుపడి దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతుకు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే వరి కోతలు పూర్తయి ఉంటే కల్లాల్లోని ధాన్యాన్ని రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు త్వరగా పంపించాలన్నారు. లేదా సురక్షిత ప్రదేశాల్లో జాగ్రత్త పర్చుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సంధ్య, విఆర్ఒ విజయలక్ష్మి, రైతులు ఉన్నారు.

మోడీ కార్పొరేట్ అనుకూల విధానాలు వీడాలి



తణుకులో నినదిస్తున్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - తణుకు

మోడీ ప్రభుత్వం కార్పొరేట్ విధానాలు అమలు చేయడం మానుకోకపోవడం సిగ్గుచేటని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. మంగళవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ, నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సర్వ సంపదలు సృష్టించే కార్మికులకు, ప్రజలకు తిండి పెట్టే రైతుల సమస్యలను పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజా ధనం దోచుకుందని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాటను మోడీ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడకపోతే బిజెపి మరింత మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రతాప్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపి, గార రంగారావు, వల్లూరి వెంకటేశ్వరరావు, అయ్యప్ప, శ్రీనివాసరాజు, త్రిమూర్తులు, సురేంద్ర, కొమరరాణి, అనంతలక్ష్మి, అనిల్, శివ, శ్రీను పాల్గొన్నారు.

యలమంచిలి : ప్రభుత్వం అంగన్వాడీలు, ఆశాలు, ఇతర స్కీం వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని కొంతేరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీవర్ధిని, దేవ సుధాకర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి స్కీం వర్కర్లందరికీ రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రోజా, కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.



కొంతేరు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న స్కీమ్ వర్కర్లు



పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురంలో వైద్య శాఖ అధికారుల తనిఖీలు
ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 25న ఆ వైద్యులు తీరు.. జనం బేజారు..! శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ స్పందించింది. మంగళవారం ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఎంహెచ్ఒ స్వరూప్, అర్బన్ పిహెచ్‌సి వైద్యురాలు మోహనతో కలిసి పట్టణంలో కొన్ని ఆర్ఎంపి వైద్యశాలలపై దృష్టి పెట్టారు. ఎక్కువ ఫిర్యాదులొస్తున్న శ్రీహరిపేటలోని ఓ ఆర్ఎంపి నిర్వహిస్తున్న వైద్యశాలపై దాడులు నిర్వహించారు. నరసాపురం వైద్య ఆరోగ్య శాఖ ఈ విషయంలో స్పందించిన తీరుపై అనేక విమర్శలు రావడం గమనార్హం. కనీసం చుట్టుపక్కలా విచారణ చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు ఆర్ఎంపికి ముందుగానే వైద్యాధికారులు సమాచారం ఇచ్చి ఆ ఆర్ఎంపి అక్కడ నుంచి వెళ్లిపోవడానికి అవకాశం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. డిప్యూటీ డిఎంహెచ్ఒ తనిఖీకి వెళ్లినప్పుడు ఆర్ఎంపి నిర్వహణ సామగ్రిని వేరే ప్రాంతాలకు తరలించి ఒంటరిగా అక్కడ ఉండేటట్లు పథకం రచించాడు. ఆర్ఎంపిలపై దాడులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పట్టణంలో అనధికారంగా క్లినిక్‌లు నిర్వహిస్తున్న పలువురు ఆర్ఎంపిలు పరారయ్యారు. మొత్తంగా ఉన్నత అధికారుల ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించినప్పటికీ సదరు నకిలీ వైద్యులపై తీసుకునే చర్యల విషయంలో ఇలాంటి ఉదాసీన వైఖరి అవలంబించడంపై విమర్శలు వస్తున్నాయి. డిప్యూటీ డిఎంఎన్‌హెచ్ స్వరూప్ మాట్లాడుతూ నకిలీ వైద్యశాలలు నిర్వహిస్తున్నా, అనధికారంగా వైద్యం చేస్తున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం జరిపిన తనిఖీల్లో ఎలాంటి లోపాలు తాము గుర్తించలేదని పేర్కొన్నారు.

మాధవరం, కంసాలిపాలెం బ్రిడ్జిని నిర్మించాలి
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాధవరం, కంసాలిపాలెం బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని, ఎర్రకాలువ ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కనుగొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం తాడేపల్లిగూడెం మండల ఎనిమిదో మహాసభ మంగళవారం మాధవరంలో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య వక్తలుగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామంలో నిర్మించిన సిపిఎం స్తూపాన్ని సందర్శించి పార్టీ జెండాను బాబూరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యానికి ఏటా ఎర్రకాలువ ముంపునకు గురై రైతులు పంట నష్టపోతున్నారన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం ఎర్రకాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని, మాధవరం, కంసాలపాలెం మధ్యలో ఉన్న బ్రిడ్జిని తక్షణం నిర్మించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మండలం చారిత్రాత్మకమైందని, వీర జవాన్లను అందించిన మిలటరీ మాధవరం, అలాగే కమ్యూనిస్టు లగడ్డ ఎర్ర దండగర్ర ఈ రెండు గ్రామాలకు ఎంతో చరిత్ర ఉందని వీరి త్యాగఫలం వృథా కాదని తెలిపారు. ఆ వీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలన్నారు. మండల పూర్వపు కార్యదర్శి పి.గోవిందు మాట్లాడుతూ అప్పారావుపేటలో పేదలకు భూములు పంచిన ఘనత సిపిఎం దేనని, చుట్టుపక్కల గ్రామాల్లో అనేక ప్రజా సమస్యలు తీసుకుని పోరాడిన చరిత్ర సిపిఎంకు ఉందని తెలిపారు. పెంటపాడు మండల కన్వీనర్ సిరపరపు రంగారావు మాట్లాడుతూ మండలంలో స్కీం వర్కర్ల, బిల్డింగ్ రంగం సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు చేస్తోందన్నారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా కండెల్లి సోమరాజు, పాలుపూరి సత్యవతి జయమ్మ వ్యవహరించారు. మహాసభలో ప్రజా నాట్యమండలి దళం జిల్లా కార్యదర్శి షేక్ వలీ, పోతు శ్రీను దుర్గ పాడిన విప్లవ గీతాలు అలరించాయని పేర్కొన్నారు. ఈ మహాసభలో సిద్ధాపత్తుల నాగేశ్వరరావు, పూరెళ్ల సుబ్బారావు, కండెల్లి విజయ, మడక రాజు, మల్లుల పరమేశు, పి.కృపారావు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి : సిపిఎం

తణుకు రూరల్: వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఎం గ్రామ కమిటీ తరపున భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ మండలంలో ఉన్న 9 గ్రామాల ప్రజలకు వేల్పూరులో ఉన్న పిహెచ్‌సి అనేక వైద్య సేవలందిస్తోంది. అయితే ముఖ్యంగా రోగులకు అవసరమైన రక్త పరీక్షలు చేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్, ఎఫ్ఎన్ఒ, ఎంఎన్ఒ, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సిబ్బంది కొరత కారణంగా రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులో లేక రోగులకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. గతంలో ఈ ఆసుపత్రి పరిధిలో అందించిన వైద్య సేవలను గుర్తించి అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశంలో అత్యుత్తమ పిహెచ్‌సిగా గుర్తించి అవార్డు అందించినట్లు వీరభద్రరావు గుర్తు చేశారు. అటువంటి గుర్తింపు పొందిన ఆసుపత్రి ప్రస్తుతం రోగులకు రక్త పరీక్షలు చేయలేని పరిస్థితిలో ఉందన్నారు. రెండేళ్ల నుంచి ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో ఇన్‌ఛార్జి టెక్నీషియన్ వారంలో రెండు రోజులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ మిగతా రోజుల్లో ఆసుపత్రికి వచ్చిన రోగులకు రక్త పరీక్షలు చేయడానికి వీల్లేకుండా పోయింది. దీంతో రోగులు ప్రయివేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని వీరభద్రరావు వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.జార్జి, కె.సుబ్బరాజు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు

భీమవరం టౌన్ : భీమవరం మెంటేవారితోటలోని పువ్వులపల్లి సుందరయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు సహాయ కేంద్రంలో డాక్టర్ విక్రమ్ ప్రత్యేక వైద్య నిపుణులు పలువురు చిన్నారులకు 2డి ఎకో ఉచిత పరీక్షలు నిర్వహించారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో 40 మంది చిన్నారులకు ఇప్పటి వరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు జరిగాయి. భీమవరం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు చిన్నారులకు ప్రతినెల 4వ మంగళవారం ఈ వైద్య శిబిరం తోడ్పడుతుంది. అవసరమైన వారు ఈ క్యాంపును వినియోగించుకోవాలని వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.

కనకరత్నమాలకు సత్కారం

ఆచంట : కార్తీకమాసం సందర్భంగా మంగళవారం కొడమంచిలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించి సత్కరించారు. దుబాయిలో 50 దేశాలు, 20 రాష్ట్రాలు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భీమవరానికి చెందిన వాకర్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లుకు బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు తీసుకున్న ఏకైక మహిళని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాలనాగు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా రత్నమాల చేసిన సేవలను అభినందించారు. రత్నమాల గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు 150 అవార్డులు, 500 సన్మానాలతో పాటు మూడు గౌరవ డాక్టరేట్లు, స్వర్ణ నంది అవార్డులు తీసుకున్న సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కొల్లేపర చాయగుప్త, మాజీ అధ్యక్షులు కొల్లేపర వెంకన్న బాబు పాల్గొన్నారు.

రేలంగికి ఘన నివాళులు

భీమవరం టౌన్ : తన హాస్యంతో ప్రేక్షక హృదయాలలో నిలిచిపోయిన రేలంగి హాస్యానికి భాష్యం చెప్పారని కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భీమవరం వెంకట్రామ థియేటర్ కాంప్లెక్స్ హాల్‌లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తొలి సినీ రంగ పద్మశ్రీ అవార్డు గ్రహీత రేలంగి వెంకట్రామయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ శోభనబాబు అభిమాన సంఘం నాయకులు భట్టిప్రోలు శ్రీనివాస్‌రావు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి మల్లుల సీతారాం ప్రసాద్, ఎస్‌కెబిఎస్ భాషా మాట్లాడుతూ రేలంగి చిత్రకళ మందిరం నిర్మించి అనేక మంది సినీ ప్రముఖులను తమ ప్రాంతానికి తీసుకుని వచ్చారని, హాస్య నటన చాతుర్యంలో రేలంగికి సాటిలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలూరి స్వరూప్ కుమార్, పి.శివరామ్ పాల్గొన్నారు.

ఎంఐసియు ప్రారంభం

తణుకు : ముళ్లపూడి వెంకటరాయ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం పొందే విధంగా అన్ని సౌకర్యాలు ముళ్లపూడి వెంకటరాయ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ కల్పిస్తుందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం తణుకు పట్టణం వేల్పూరు రోడ్డులో ఉన్న ముళ్లపూడి వెంకటరాయ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో మెడికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎంఐసియు)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ 10 బెడ్ల ఎంఐసియు ప్రజలందరికీ అందుబాటులో తీసుకురావడం జరిగిందన్నారు. కిడ్నీ, డయాలసిస్, ఐసియు వంటి పలు డిపార్ట్మెంట్లకు సంబంధించిన వైద్య సేవలు ఈ హాస్పటల్‌లో అందుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రముఖ ప్రయివేట్ హాస్పటల్ అనుసంధానంతో వైద్య సదుపాయాలు అందుతాయని, ఎవిజి, స్టార్ హాస్పటల్స్ వారితో కలిసి మెరుగైన వైద్య సేవలు అందజేస్తారని తెలిపారు.

జెడ్‌పి స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో లంకల కోడేరు హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ దృష్టిలోపం విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించకూడదని అన్నారు. ఈ స్కూల్‌లో 500 మందికి పరీక్షలు జరపగా వారిలో 25 మందికి కళ్లజోళ్లు ఉచితంగా ఇవ్వడానికి గుర్తించినట్లు ఆప్తాల్మిక్ అధికారులు ఎంఆర్‌కె.రాజు, సునీల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఆర్ఎస్‌విఎస్.శర్మ, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ ఎలిజబెత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండి : మండల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మ్యాక్స్‌విజన్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మండల అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కళ్లను పరిరక్షించుకోవాలని అన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకందించాలి : సిపిఎం

పాలకొల్లు : పట్టణంలో టిడ్కో గృహాలను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మహిళా సంఘం భవనంలో దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పేదలు లక్షలాది రూపాయలు అప్పులు చేసి ప్రభుత్వానికి ముందస్తు డిపాజిట్ చెల్లించారన్నారు. కట్టిన డిపాజిట్‌కు వడ్డీలు గత 8 సంవత్సరాలుగా కడుతూ వస్తున్నారన్నారు. ఇప్పటికైనా 90 శాతం పూర్తి చేశామని చెబుతున్న కూటమి ప్రభుత్వం మిగిలిన 10 శాతం పూర్తి చేసి అందించాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్ల దగ్గర కాలువ వద్ద రేవు నిర్మించాలని కోరారు. టిడ్కో ఇళ్ల వద్ద మున్సిపాలిటీ పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాలువపై కాలిబాట వంతెన నిర్మించాలన్నారు. సాయిబాబా గుడి దగ్గర నుంచి టిడ్కో ఇళ్ల వరకు వీధిలైట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. జవ్వాది శ్రీనివాసరావు, యాకల రాము, లక్ష్మి, చల్లా సోమేశ్వరరావు, కె.స్వరాజ్యలక్ష్మి, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

మొగల్తూరు : ధాన్యం విక్రయాలకు దళారులను ఆశ్రయించవద్దని ఆర్‌డిఒ దాసిరాజు రైతులకు సూచించారు. మండలంలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయాలు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎడిఎ ఈద అనిల్ కుమారి, తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎఒ ఎస్.అబ్దుల్ రహీం, డిటి సంధ్య ఉన్నారు.

నరసాపురం : మండలంలోని సీతారాంపురం రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి సందర్శించారు. రైతుల వద్దనుంచి ధాన్యం సేకరణ చేయుచున్న ధాన్యాన్ని పరీక్షించు యంత్రాన్ని ఉపయోగిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ రాగల రెండు రోజుల తరువాత వాయుగుండం ప్రభావం ఉంటుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తహశీల్దార్ వెంట పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా

భీమవరం టౌన్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు బ్యాన్ చేసినట్లు, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఫైన్ వేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే అధికారులు ప్రతి షాప్‌ని తనిఖీలు చేయడమే కాకుండా వ్యాపారస్తులు కవర్లు వాడకూడదని గుడ్డ సంచులనే వినియోగించాలని అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ అధికారులు షాపు తనిఖీ చేసి ఒక వ్యాపారస్తుడికి రూ.3 వేలు ఫైన్ విధించారు.

పాఠశాల ప్రహరీని కాపాడాలని వినతి

తణుకు రూరల్ : వేల్పూరు గ్రామంలో ఉన్న మండల పరిషత్ నెంబర్ 4 పాఠశాల ప్రహరీ గోడను, పంచాయతీ రోడ్డుని కాపాడాలని కోరుతూ తణుకు మండల కో ఆప్షన్ సభ్యులు కత్తుల జస్పల్ కోరారు. ఈ మేరకు మంగళవారం తణుకు తహశీల్దార్ డివివిఎస్.అశోక్ వర్మకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలకు చేర్చి ఉన్న చేపల చెరువు కోతకు గురై పాఠశాల ప్రహరీ, రోడ్డు కోతకు గురవుతుందని దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన తహశీల్దార్‌ను కోరారు.

మద్యం విక్రేతల అరెస్టు

తాడేపల్లిగూడెం: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. పెంటపాడు మండలం నేలవల్లూరు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ ఎస్ఐలు మురళీ మోహన్, దొరబాబు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భీమవరం టౌన్ : అక్రమంగా మద్యం బాటిళ్లు అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ బలరాం కృష్ణంరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామానికి చెందిన జవ్వాది తాతాజీ రావు మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో దాడి చేసి అతను వద్దనుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ పివివి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దు

ఆర్‌డిఒ దాసిరాజు



ప్రజాశక్తి - నరసాపురం

రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, సమీపంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరను పొంది ఆర్థికంగా పరిపుష్టి కావాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. రైతులు అమ్మిన ధాన్యానికి 48 గంటలలోపు రైతు ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమచేయడం జరుగుతుందన్నారు. రైతుల ధాన్యం రైసు మిల్లుకు చేరుకోవడానికి అవసరమైన అంచనా సమయం, రవాణా కాబడిన సమయం, దూరం నిర్ణయించడం జరిగి, దానికనుగుణంగా రైతులు అమ్మకం చేసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేసియున్నామన్నారు. రైతులందరూ సకాలంలో ధాన్యాన్ని ఎటువంటి కమిషన్ ఏజెంట్, దళారుల ద్వారా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకాలు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా రైతుల వద్దనుంచి ప్రభుత్వం వారు నిర్దేశించిన మద్దతు ధర కన్నా తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు నిర్ధారణ కాబడినట్లయితే చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాల పార్కింగ్

ప్రయాణికుల ఇబ్బందులు
ఆర్‌టిసి అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - నరసాపురం



బస్ స్టాండ్ ఎదురుగా పార్కింగ్ చేసిన బైక్స్

నరసాపురం బస్టాండ్‌కు వచ్చే మార్గంలో ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు పార్క్ చేస్తున్నారు. దీంతో బస్టాండ్‌కు వచ్చి, వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏదో కొద్దిసేపు అంటే పొరపాటే, నిత్యం బస్ స్టాండ్‌కు ఎదురుగా రోజుల తరబడి బైక్స్ పార్క్ చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వేరే ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు బస్‌స్టాండ్ సమీపంలో పార్కింగ్ స్థలం ఉంది. అయినప్పటికీ ఇక్కడ మాత్రం అరకొరగా బైక్స్ పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి, బస్‌స్టాండ్ ఎదురుగా పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

ప్రజాశక్తి - వీరవాసరం



పాలకోడేరు : మాట్లాడుతున్న డ్వామా పీడీ అప్పారావు

మండలంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అబేద్కర్‌కు ఘనంగా నివాళి అర్పించారు. మంగళవారం రాయకుదురులో సర్పంచి గెడ్డం భారతీభాస్కరావు అంబేద్కర్ చిత్రపటానికి, వీరవాసరంలో తాడిరాజశేఖర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళ్ల : రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని పిల్లలు చక్కగా చదువుకొని అభివృద్ధి పథంలో ముందుండాలని మండల విద్యాశాఖ అధికారి ఎ.రవీంద్ర అన్నారు. సీసలి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఎంఇఒ రవీంద్ర ఈ వేడుకల్లో పాల్గొని భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. పిల్లలచే రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అడ్డాల వెంకట సుబ్బరాజు, ఉపాధ్యాయులు బిఆర్ఎంకె.స్వామి, ఎన్.విజయలక్ష్మి, సిఆర్ఎంటిలు బి.ప్రకాష్ బాబు, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.

గణపవరం : భారత రాజ్యాంగంలో పేర్కొన్న ఆశయాలు, విలువైన సందేశాలు ప్రతి ఒక్కరూ ఆచరించినప్పుడే రాజ్యాంగ నిర్మాత కలలు నిజమవుతాయని ప్రజాచైతన్య వేదిక నాయకులు పి.గోవింద్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ప్రజాచైతన్య వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం జె.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రాజ్యాంగాన్ని చదవాల్సిన అవసరముందని అన్నారు. రానున్న రోజుల్లో రాజ్యాంగ ప్రతులు, స్థానిక లైబ్రరీలో కరపత్రాల రూపంలో పరిచయం చేయబోతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు కె.పద్మలత, ఇవి.సూర్యనారాయణ, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రచించిన రాజ్యాంగ రచనలను ప్రతి విద్యార్థి చదవాలని గణపవరం డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక డిగ్రీ కాలేజీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లెక్చరర్లు టి.అక్కిరాజు, జి.వెంకటరమణ, భాస్కరరావు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకోడేరు : పెన్నాడ అగ్రహారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాగుల చెరువు ట్యాంక్ వద్ద అమృత సరోవర్ ఉపాధి హామీ చట్టం వేతనదారులకు, అమృత సరోవర్ యూజర్ గ్రూపులకు రాజ్యాంగ పీఠికపై అవగాహనా కార్యక్రమం డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు అవగాహన కల్పించి మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల సమాన హక్కులు లభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వీరమల్లు రెడ్డియ్య, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.సుజాత, ఇసి కె.శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తణుకు ప్రసాద్, ఉప ఎంపిపి ఆధాడ లక్ష్మి తులసి, టెక్నికల్ అసిస్టెంట్ జయబాబు, జిల్లాలోని అందరూ టెక్నికల్ అసిస్టెంట్‌లు, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ వేతనదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళీకృష్ణ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎబిఎస్ఆర్.మనోహర్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ కొప్పర్తి రాగిణి, హెచ్ఒడిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో ఎంఇఒ ఆర్ఎన్ఎస్‌వి శర్మ అధ్యక్షతన భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ రాజ్యంగ ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని సంవిధాన్ దివాస్ అని కూడా అంటారని చెప్పారు. ఇదే రోజును జాతీయ చట్ట దినోత్సవంగా కూడా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భవానీప్రసాద్, రాయపూడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసాపురం: ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సంఘ ఆలోచనల వేదిక అధ్యక్షుడు మట్ట సుధీర్ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని రాజ్యాంగ రూపకర్త, అంబేద్కర్ వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్కూల్ హెచ్ఎం నాగలక్ష్మి, గ్రంథాలయ పాఠకులు శ్యాంబాబు, సూర్యం బాబు, సతీష్ ఆచారి కళ్యాణి, సంధ్య, స్వరాజ్యం, లక్ష్మి, జ్యోతి, శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

నరసాపురం తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

తాడేపల్లిగూడెం : దేశ పౌరులందరికీ సమన్యాయం అందేలా భారత రాజ్యాంగం రూపొందించిందని తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాష పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ హాల్లో 11వ అదనపు జిల్లా జెడ్జి షేక్ సికిందర్ భాష, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దూలం విజయకుమార్ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణశ్రీ, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.అరుంధతి, బార్ సెక్రెటరీలు గీతా రెడ్డి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎపి నిట్‌లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తాడేపల్లిగూడెం తహశీల్దార్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెం తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విఆర్‌ఒలతో, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

ఆచంట : భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలలో ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ జి.కనకరాజు, ఎంపిడిఒ పూర్ణ బాబ్జి అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగానికి కట్టుబడి పనిచేస్తామంటూ ప్రమాణం చేశారు. ఆయా కార్యక్రమాలలో డిప్యూటీ తహశీల్దార్‌లు కె.సోమేశ్ కుమార్, సిఎస్‌డిటి దేవి, ఎలక్షన్ డీటీ కిషోర్ కుమార్, ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవంను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు గొల్ల జనార్ధన్ రావు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత రాజ్యాంగం గొప్పదని, దానిని మనందరం కలిసికట్టుగా కాపాడుకోవాలన్నారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఐవిఎన్ రాజు, వివివి.ప్రసాద్, సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు: మండలంలో పలుచోట్ల రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని దుంపగడప వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షతన జరిగిన సభలో విద్యార్థులు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు అంశాలను వివరించారు. స్థానిక మాదివాడ జిల్లా శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి ఘటించారు. పిల్లలకు రాజ్యాంగంపై నగర పంచాయతీ డిప్యూటీ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ, అడ్వకేట్ నెల్లి సతీష్, గ్రంథాలయ పాలకురాలు పార్వతిలు అవగాహన కల్పించారు.

స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో లయన్స్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆక్వా ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాణం అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ముత్యాల వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సభలో అడ్వకేట్ నెల్లి సతీష్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కంభంపాటి నరసింహ, కార్యదర్శి జి.నారాయణ రాజు, కోశాధికారి సుబ్బరాజు, ఉపాధ్యాయులు నాజర్ మాట్లాడారు.

తణుకు : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని ఇరగవరం సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి అన్నారు. మంగళవారం ఇరగవరం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మత చిచ్చు పెడుతూ దేశ సమైక్యతను భగ్నం చేస్తుందన్నారు. రాజ్యాంగంలోని మౌళిక సూత్రాలన్నింటినీ మార్చడానికి ప్రయత్నం చేస్తుందని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. సిఐటియు మండల నాయకులు జుత్తిగ రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లి కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు గుబ్బల ముత్యాలు, జక్కంశెట్టి గంగాధర్‌రావు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో ఏ దేశానికి లేనటువంటి రాజ్యాంగం మన దేశానికి ఉందని, దేశ ప్రజలందరూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారంటే ఆరోజు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం ఎంఎల్ఎ కార్యాలయం వద్ద భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌డి కాలేజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎంసిఎ, ఎంబిఎ), ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పిజి(అటానమస్) తణుకు వారు సంయుక్తంగా రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా కళాశాల ఆవరణలో నిర్వహించారు. రూట్స్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని పాఠశాల ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి తెలియజేశారు. తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భీమవరం టౌన్ : స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను కళాశాల విద్యార్థులతో కలిసి జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించి మనకి మనం అర్పించుకున్న దినంగా రాజ్యాంగ దినోత్సవాన్ని పేర్కొన్నారు. భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో భారతదేశం ఒక దేశంగా మనుగడ సాధించి నిలదొక్కుకొనడానికి ఈ రాజ్యాంగం ఎంతగానో దోహద పడిందని ఆయన పేర్కొన్నారు. తహశీల్దార్ రావి రాంబాబు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, ఎన్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఆర్.కృష్ణ చైతన్య, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నాకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జిఎస్.విజయలక్ష్మి, బి.రత్నకుమారి, జి.నర్మద, ఎన్‌డివి ప్రసాద్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమత్స రామరాజు పర్యవేక్షణలో విద్యార్థులకు క్విజ్, ఎస్సై రైటింగ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన దేశ నాయకుల వేషధారణ ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రథమ సహాయకులు కృష్ణంరాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గొప్ప దార్శనికులుగా ప్రపంచంలో నిలిచారని మాల మహానాడు మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆలమూరు గ్రామ కాలవ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆలమూరు గ్రామ సంఘ సభ్యులు పిల్లి రమేష్, కోట సుబ్బారావు, వడ్డీ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

ఉండి: మండల తహశీల్దార్ కార్యాలయంలో, శాఖా గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమార్ మాట్లాడుతూ 'భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజును గుర్తు చేసుకుంటూ నిర్వహించుకునే 'రాజ్యాంగ దినోత్సవం' సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాందువ్వ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఎఎస్ఒ రామారావు, గ్రంథాలయాధికారి జెవి.కృష్ణమూర్తి, పలువురు కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కన్వీనర్‌గా రంగారావు

ప్రజాశక్తి - పెంటపాడు



సిపిఎం నూతన మండల కన్వీనర్‌గా సిరపరపు రంగారావు ఎన్నికయ్యారు. మండలంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిపిఎం 7వ మండల మహాసభ మండలంలోని యానాలపల్లి గ్రామం ఎస్‌సి కమ్యునిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ముందుగా కొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టారు. రైతులకు గిట్టుబాటు ధర చట్టం చేయాలి, కౌలుదారులకు గుర్తింపు కార్డులివ్వాలి, ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయించాలని, మంచినీరు సరఫరా, రోడ్లు, డ్రెయినేజీ, దోమలు, కుక్కల సమస్యల మీద ఉద్యమించాలని, లబ్ధిదారులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇప్పించాలని, గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న పేరుతో నిర్మించిన ఇళ్లను, కొన్ని ప్రాంతాల్లో పూర్తికాని ఇళ్లను టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తి చేసి పేదలకు అందించాలన్నారు. టిడిపి కూటమి చెప్పినటువంటి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని, విద్యుత్ భారాలు ప్రజల పైన వేయడం సరైందికాదని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపు మీద పెద్ద ఎత్తున ఉద్యమించాలని, నిరంతరం స్థానిక ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలని తీర్మానించారు. అనంతరం సిపిఎం నూతన మండల కన్వీనర్‌గా సిరపరపు రంగారావు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు బంకురు నాగేశ్వరరావు సలపాల సత్యనారాయణ, మరపట్ల దానయ్య, అనురాధ, కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రానున్న రోజుల్లో ఈ సమస్యల పరిష్కారానికి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

డిఎస్‌పి శ్రీవేదను కలిసిన ఎక్సైజ్ అధికారులు

నరసాపురం : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు లేకుండా చూడాలని డిఎస్‌పి శ్రీవేద అధికారులను సూచించారు. నరసాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీవేదను మంగళవారం నరసాపురం ఎక్సైజ్ స్టేషన్ సిఐ ఎస్.రాంబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు సిఐ, ఎస్ఐలు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ నిత్యం తనిఖీలు చేయాలని, తనిఖీల్లో పట్టుబడితే కేసు నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఎండీ.జైనులాబ్దిన్, ఖాసీం పాల్గొన్నారు.



డిఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎక్సైజ్ సిఐ రాంబాబు, ఎస్ఐలు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయ సదస్సు

భీమవరం టౌన్ : అన్ని చట్టాలు రాజ్యాంగానికి లోబడి రూపొందించబడతాయని, ప్రజలకు రాజ్యాంగం ప్రాథమిక హక్కులను, విధులను కల్పించిందని ప్రతీ పౌరుడు భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్, 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి గౌరవ ఎం.ఎ.సోమశేఖర్ అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఛైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని భారత రాజ్యాంగ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి.ధనరాజు పాల్గొన్నారు.

చెస్‌లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు రూరల్ : ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్ విద్యార్థులు పశ్చిమగోదావరి జిల్లా రాపిడ్, బ్లీడ్జ్ చెస్ చాంపియన్ షిప్ 2024 జరిగిన చెస్ గేమ్స్‌లో విజేతలుగా నిలిచారు. బ్లీడ్జ్ అండర్-15 కేటగిరిలో మొదటి బహుమతి, రాపిడ్ అండర్-15 కేటగిరి విభాగంలో మొదటి బహుమతులను యిరింకి వెంకట కార్తికేయ ఆశిష్, 10వ తరగతి విద్యార్థి గెలుచుకున్నారు. రాపిడ్ అండర్-7 విభాగంలో చెరుకువాడ స్నేహిత సత్య 3వ తరగతి విద్యార్థిని మొదటి బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యాసంస్థల డైరెక్టర్, అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు గేమ్స్‌లో కూడా మొదటి స్థానంలో ఉండాలని తెలియజేశారు. వైస్ ప్రిన్సిపల్స్ ఉషాకుమారి, దేవి ఫైనాన్స్ మేనేజర్ రావాడ సతీష్, చెస్ కోచ్ దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

తాడేపల్లిగూడెం: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం ఉషా గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో సైబర్ నేరాల నివారణపై జరిగిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో పడితే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. తాడేపల్లిగూడెంకు చెందిన వివిధ బ్యాంక్ మేనేజర్లు, ఉద్యోగులు, విశ్లేషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో మంగళవారం కళాశాల సోషల్ మీడియా, సైబర్ బెదిరింపుల కమిటీ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ ఆఫ్ సైబర్ బుల్లియింగ్ అండ్ సోషల్ మీడియా అబ్యూస్‌పై జాతీయస్థాయి అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ డాక్టర్ టిడి విమల మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ఆన్‌లైన్ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ టి.కృష్ణ, వైస్ ప్రిన్సిపల్ కె.భద్రాచలం, ఐక్యుఎసి కోఆర్డినేటర్ సిహెచ్.రవికుమార్ పాల్గొన్నారు.

మత్స్య కళాశాల సందర్శన

నరసాపురం: మండలంలోని సరిపల్లిలో మధ్యస్థంగా నిలిచిన ఆక్వా యూనివర్శిటీ పనుల్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో తుఫాన్ భవనంలో నిర్వహిస్తున్న మత్స్య కళాశాలను ఆయన సందర్శించారు. ఎంఎల్ఎ నాయకర్‌కు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ టి.నీరజ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇరుకు భవనాల్లో పడుతున్న ఇబ్బందుల్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ యూనివర్శిటీ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందన్నారు. విద్యాపరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సర్పంచి తిరుమాని వెంకటరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఆచంట మండలం కరుగోరుమిల్లి పంచాయతీ పరిధి బాబా నగర్ గ్రామానికి చెందిన మైలే మాధురి, తండ్రి గణేశ్వరరావుకు చెందిన. U6948298 గల విశాఖపట్నం వారు 23-01- 2020. తేదీన జారీ చేసిన పాస్‌పోర్టు పోయినది. పాలకొల్లు నుంచి కరుగోరుమిల్లు మోటార్ సైకిల్‌పై వస్తుండగా పోడూరు మండలం కవిటంలో మిస్సయినది. ఎంత వెతికినా ఎక్కడ దొరకలేదు. కావున నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికితే ఈ కింది అడ్రస్కు తెలియపరచగలరు.

మైలే మాధురి, తండ్రి గణేశ్వరరావు
డోర్ నెంబర్ 4-35, బాబా నగర్ కరుగోరుమిల్లి
ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
ఆంధ్రప్రదేశ్, పిన్కోడ్ నెంబర్ 534269.
సెల్ : 9491111926.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా కోర్టులో, తాడేపల్లిగూడెం
ఇ.పి.నెం.146/2021
ఎఆర్.సి.నెం.408/2016

బిట్వీన్ :
M/s.శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్
తాడేపల్లిగూడెం ...డి. హెచ్. ఆర్
మరియు
ఎన్.పూర్ణచంద్ర మరియు ఇతరులు ...జె.డి.ఆర్స్
జెడిఆర్-1 : నిడదవోలు పూర్ణచంద్ర, S/o.కృష్ణామూర్తి, హిందు, పురుష, వయస్సు 54 సం॥లు, డోర్.6-2-18/7, మసీద్‌రోడ్డు, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.

పై గ్రంథములో మీ యొక్క వ్యక్తి గతమైన హాజరు నిమిత్తము పైన వివరించిన పిటిషన్‌ను ది.**09-12-2024** కు వాయిదా అయివున్నది. ఆరోజు ఉదయం 10.30 ని మీరు వ్యక్తిగతముగాని, లేక మీ లాయర్‌గారు ద్వారా గాని పైకోర్టు ఎదుట హాజరు అయి మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకోవలెను. లేనిచో శ్రీకోర్టు వారు తీసుకొను నిర్ణయమునకు మీకు ఎటువంటి అభ్యంతరము లేదు అని భావించబడును.
(శ్రీకోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది: 09-12-2024

కె.వి.యస్.ఎన్.ఆర్.గోపాల్
అడ్వకేటు, ఏలూరు.